మట్టి రోడ్డుకు మహర్దశ..!

- సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.6.60 కోట్లు మంజూరు
- త్వరలో మల్లారం నుంచి కన్నారం వరకు బీటీ రోడ్డు నిర్మాణం



ఇచ్చుల్లపల్లి మట్టి రోడ్డు

భీమదేవరపల్లి : మండలంలోని మల్లారం గ్రామం నుంచి ఇచ్చులపల్లి మీదుగా కన్నారం వరకు ఉన్న మట్టి రోడ్డుకు మహర్దశ రానుంది. దశాబ్దాలుగా మట్టి రోడ్లపై ప్రజలు ఎదుర్కొన్న సమస్య తీరనుంది. సీఎం కేసీఆర్ ప్రత్యేక అభివృద్ధి నిధుల్లో నుంచి హుస్నాబాద్ నియోజకవర్గానికి బీటీ రోడ్ల నిర్మాణం కోసం రూ.20 కోట్లు మంజూరు చేయగా అందులోంచి మల్లారం నుంచి కన్నారం గ్రామానికి రూ.6.60కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు మంజూరైనట్లు ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ వెల్లడించారు.

అనేక ఇబ్బందులు

గతంలో మండలంలో ఉన్న కన్నారం, ఇచ్చుల్లపల్లి గ్రామాలు కొత్తగా ఏర్పడ్డ వేలేరు మండలంలో కలిశాయి. కాగా కన్నారం, ఇచ్చుల్లపల్లి గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు, ఉన్నత చదువులు, వ్యాపారం తదితర అవసరాల కోసం ముల్కనూర్‌కు వెళ్లడం పరిపాటి. ఈ క్రమంలో ఆ దారి మట్టి రోడ్డు కావడంతో తేలికపాటి వర్షాలు కురిసినా రోడ్డు బురదమయంగా మారి ప్రయాణం నరకప్రాయంగా అనిపించేది. ఇక ఆయా గ్రామాల రైతులు వ్యవసాయ బావుల వద్దకు ఎరువుల బస్తాలు తీసుకెళ్లడం, పండిన ధాన్యాన్ని ఇంటికి తీసుకు రావడానికి సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ఇక్కట్లకు గురవడం సహజ పరిణామంగా పరిణవించింది. అనేక ఏళ్లుగా ప్రజలు పడుతున్న ఇబ్బందులకు చెక్ పడనుండడంతో మల్లారం, ఇచ్చుల్లపల్ల, కన్నారం గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు



మల్లారం నుంచి ఇచ్చుల్లపల్లి మీదుగా కన్నారం గ్రామం వరకు బీటీ రోడ్డుగా నిర్మించేందుకు ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చొరవ తీసుకుని సీఎం ప్రత్యేక అభివృద్ధి నిధుల నుంచి రూ.6.60 కోట్లు మంజూరు చేయించడం అభినందనీయం. ఆయా గ్రామాల ప్రజల సమస్య తీరనుంది. ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.

- వంగ రవి, జెడ్పీటీసీ

క్లుప్తంగా

రోడ్లపై నిత్యం బురద..



బురదను చూపిస్తున్న 5వ వార్డు ప్రజలు

నడికూడ : కాలంతో సంబంధం లేకుండా మురుగు నీరు చేరుతుండడంతో రోడ్లపై నిత్యం బురద ఉంటోందని మండలంలోని రామకృష్ణాపూర్ గ్రామంలోని 5వ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వార్డుకు చెందిన పలువురు ఆదివారం సమస్యను మీడియా దృష్టికి తీసుకొచ్చారు. పదేళ్ల క్రితం వేసిన రోడ్డుకు సైడ్ డ్రెయినేజీ లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపైకి చేరుతోందని వాపోయారు. దోమలు, ఈగలు ప్రజలు రోగాల పాలౌతున్నామని చెప్పారు. సమస్యను పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని తెలిపారు. ఇప్పటికైనా డ్రెయినేజీ నిర్మించడంతోపాటు మళ్లీ సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు.

మైనార్టీ దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

శాయంపేట : మైనార్టీ దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని మైనార్టీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీని తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి (టీఆర్‌వీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మహ్మద్ మున్నా కోరారు. అన్సారీని చైర్మన్‌గా సీఎం కేసీఆర్ నియమించిన క్రమంలో అన్సారీని మున్నా ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మైనార్టీ వికలాంగుల సమస్యలను అన్సారీ దృష్టికి తీసుకెళ్లారు. మైనార్టీ వికలాంగులకు అండగా నిలవాలని కోరారు.

ఎమ్మెల్యే 'గండ్ర'కు పరాభవం తప్పదు

శాయంపేట : రానున్న ఎన్నికల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి పరాభవం తప్పదని యూత్ కాంగ్రెస్ నాయకుడు మంద శంకర్ హెచ్చరించారు. మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి బినామి పేర్లతో భూకబ్జాలకు పాల్పడుతూ పేదల భూమిని లాక్కుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు విసిరిన సవాళ్లను ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి స్వీకరిస్తే బహిరంగ చర్చకు రావాల్సి ఉంటుందనే భయంతోనే పోలీసులతో 144 సెక్షన్ పెట్టించి తప్పించుకున్నాడని ఎద్దేవా చేశారు. సమావేశంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మంద రాకేష్, నవీన్, అభిరామ్, సంజయ్, రేణిగుంట్ల అశ్విన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఐనవోలు : మండలంలోని పంథిని గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1997–98 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి విద్యార్థులు పాఠశాలకు చేరుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకుని ఆనందడోలికల్లో తేలియాడారు. తమ కుటుంబం, ఇతర వివరాలు చెప్పి సంతోషంగా గడిపారు. నాడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయులు కైలాసం, దయాకర్‌రెడ్డి, వేణుగోపాలచారి, సదానందచారి, దుర్గేశం, విజయలక్ష్మిలను శాలువాలు కప్పి జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మహేందర్ రెడ్డి, రవికుమార్, వేణు, రవీందర్, సరస్వతి, పద్మ, శారద, అనురాధ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

వరంగల్ చౌరస్తా: వరంగల్ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పిన్నావారి వీధిలో హైదరాబాద్‌కు చెందిన శ్రీకర ఆస్పత్రి వైద్యులు ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు గుంటూరు వెంకటనారాయణ, సెక్రటరీ పల్లెర్ల వీరన్న, కోశాధికారి గన్ను సంపత్ కుమార్, పిన్నా ఈశ్వర్ కుమార్, గుముడవెల్లి సురేష్, సత్యనారాయణ, వాసుదేవ్, ఐతా ప్రేమ్‌నాథ్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం

- ఎంసీఆర్సీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి



విద్యార్థినికి ప్రోత్సాహకం అందిస్తున్న ప్రవీణ్‌రెడ్డి

భీమదేవరపల్లి : ముల్కనూర్ సహకార గ్రామీణ సంఘం (ఎంసీఆర్సీ) సభ్యుల కుటుంబాల అభ్యున్నతమే లక్ష్యమని ఆ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఆ సంఘ సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో సభ్యుల పిల్లలకు నగదు ప్రోత్సాహకాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. సభ్యుల సంక్షేమమే లక్ష్యంగా సంఘాన్ని సమర్థవంతంగా నడిపిస్తున్నట్లు తెలిపారు. సభ్యుల పిల్లలు ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, బీఫార్మసీ. ఎం.ఫార్మసీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ తదితర ఉన్నత చదువులు చదువుతున్న క్రమంలో వారికి ఆర్థికంగా లబ్ధి చేకూర్చేలా నగదు ప్రోత్సాహకాల పంపిణీని చేపట్టినట్లు చెప్పారు. ఎంబీబీఎస్ చదువుతున్న వారికి రూ.15 వేలు, ఇంజనీరింగ్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అభ్యసిస్తున్న వారికి రూ.1 వేలు చొప్పున 2008 నుంచి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు. సభ్యుల పిల్లల ఉన్నత చదువులను ప్రోత్సహించేలా ఇప్పటివరకు 1095 మందికి రూ.84 లక్షలు పంపిణీ చేశామన్నారు. ఈ ఏడాది 113 మంది విద్యార్థులకు రూ.14 లక్షలు అందించినట్లు తెలిపారు. సభ్యుల కుటుంబాలు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే సంఘం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జనరల్ మేనేజర్ మార్పాటి రాంరెడ్డి, ఉపాధ్యక్షుడు చీకట్ల రాజయ్య, డైరెక్టర్లు కూన కనకయ్య, కడారి ఆదాం, మార్పాటి జయపాల్‌రెడ్డి, అంబాల రాములు, గజ్జి వీరయ్య, బేల కనకయ్య, అన్నం తిరుపతిరావు, కంది రవీందర్‌రెడ్డి, గద్ద ఐలయ్య, ఈర్ల మూగయ్య, కంకల భాగ్య, బానోతు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

- కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్



సూరారంలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

ఎల్కతుర్తి : క్రీడలు శారీరక, మానసిక వికాసానికి బాటలు వేస్తాయని తెలంగాణ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్ తెలిపారు. మండలంలోని సూరారం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మహ్మద్ ఖాన్ మెమోరియల్ ఇంటర్ జోనల్ కం డిస్టిక్ కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం నిర్వహించగా అజీజ్ ఖాన్ ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమన్నారు. లక్ష్యాలను చేరుకునేందుకు పట్టుదలతో శ్రమించాలని సూచించారు. క్రమశిక్షణతో ప్రయత్నించి రాణించాలని ఆకాంక్షించారు. పోటీల్లో భీమదేవరపల్లి, హనుమకొండ, ధర్మసాగర్, హసన్‌పర్తి, పరకాల జట్లు పాల్గొనగా పరకాల జట్టుపై భీమదేవరపల్లి విజయం సాధించింది. వీరికి ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ మారేపల్లి సుధీర్‌కుమార్, వైస్ ఎంపీపీ తంగెడ నగేష్, సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్, తక్కళ్లపల్లి సంపత్‌రావు, సర్పంచ్ కుర్ర సాంబమూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తంగెడ మహేందర్, నాయకులు రామారావు, సతీష్, సమ్మయ్య, సుధాకర్, రవీందర్ పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ కీలకం

- 'డిస్నీల్యాండ్' ముఖ్య సలహాదారు సదయ్య



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సదయ్య, తదితరులు

దామెర : ప్రతిఒక్కరి జీవితంలోనూ విద్యార్థి దశ కీలకమని డిస్నీల్యాండ్ హైస్కూల్ ముఖ్య సలహాదారు దయ్యాల సదయ్య స్పష్టం చేశారు. మండలంలోని ఓగ్లాపూర్ సమీపంలోని ఆ స్కూల్‌లో నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలో పదో తరగతి ముఖ్యమని చెప్పారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రుల, పాఠశాల యాజమాన్య, ఉపాధ్యాయుల కీర్తిప్రతిష్టలు ఇనుమడింపజేయాలని సూచించారు. వార్షిక పరీక్షల పట్ల ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని తేటతెల్లం చేశారు. ప్రశాంతంగా పరీక్ష రాయాలని సూచించారు. పదో తరగతిలోనే బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకునేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని సాధించే దిశగా పట్టుదలతో ముందుకు సాగాలని ఉద్బోధించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. అనంతరం పాఠశాల సలహాదారు లక్ష్మీనివాస్, కరస్పాండెంట్ శోభారాణి, డైరెక్టర్లు రాకేష్ భాను, దినేష్ చందర్, పవన్, భానుచందర్, కావ్య, మీన, రచన, శ్రీలత మాట్లాడారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. జీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పిల్లల ఉన్నతిలో తల్లిదండ్రులూ కీలకమే

- జిల్లా కోర్టు జడ్జి పద్మజ

కమలాపూర్ : పిల్లలు ఉన్నత స్థాయికి ఎదగడంలో తల్లిదండ్రులూ కీలకమేనని జిల్లా కోర్టు జడ్జి పద్మజ తెలిపారు. మండలంలోని అంబాల గ్రామ శివారులోని సాకేత్ హైస్కూల్ వార్షిక వేడుకలకు జడ్జి పద్మ, కేయూ విశ్రాంత ప్రొఫెసర్ ఎస్ఎస్‌వీఎన్.శర్మ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జడ్జి పద్మజ మాట్లాడారు. పిల్లలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పిల్లల నడవడికను ఎప్పటికప్పుడు గమనించాలని చెప్పారు. కేయూ విశ్రాంత ప్రొఫెసర్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నేటి సమాజంలో విద్య ప్రాముఖ్యతను, విద్యార్థులపై తల్లిదండ్రుల బాధ్యతను వివరించారు. ఎస్సై సతీష్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత సమాజంలో నెలకొన్న స్థితిగతులను అధ్యయనం చేయాలని, ఉత్తములుగా ఎదిగే దిశగా ప్రణాళికాయుతంగా ముందుకు సాగాలని చెప్పారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో సాకేత విద్యాసంస్థల చైర్మన్ కెప్టెన్ డాక్టర్ వేణుగోపాలం, ప్రిన్సిపాల్ మంజుల వేణుగోపాలం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపుతో ఆర్థిక అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్మాన్

శాయంపేట : సంపాదించిన డబ్బులో నుంచి కొంత పొదుపు చేసుకోవడం ద్వారానే ఆర్థిక అభివృద్ధి సాధించగలమని శ్రీ వెంకటేశ్వర పురుషుల పొదుపు సంఘం అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ స్పష్టం చేశారు. మండలంలోని ప్రగతిసింగారం గ్రామంలో సంఘం అధ్యక్షుడు పెద్దిరెడ్డి మహేందర్ రెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన 18వ వార్షిక మహాసభకు ఉస్మాన్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2005లో 105 మంది సభ్యులు, రూ.10,500తో సంఘం ప్రారంభమై ప్రస్తుతం 266 మంది సభ్యులతో సొంత భవనం కలిగి రూ.56 లక్షల నిధులతో అభివృద్ధి పథంలో సాగుతోందని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరికీ ఆర్థిక అవసరాలుంటాయని చెప్పారు. డబ్బును పొదుపు చేసుకోవడం ద్వారా భవిష్యత్ అవసరాలకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం సంఘం నూతన మండల అధ్యక్షుడిగా పెద్దిరెడ్డి మహేందర్‌రెడ్డిని, ఉపాధ్యక్షుడిగా చిలుకల రాజన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి

- జాతీయ నాయకుడు మురళీధర్



మాట్లాడుతున్న మురళీధర్ గౌడ్

దామెర : వచ్చే ఎన్నిల్లో బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ జాతీయ నాయకుడు, జిల్లా బూత్ సశక్తికరణ్ అభియాన్ కమిటీ సభ్యుడు మురళీధర్ గౌడ్ ఆకాంక్షించారు. మండలంలోని దుర్గంపేట్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి ముఖ్యఅతిథిగా మురళీధర్ హాజరై మాట్లాడారు. పార్టీని పటిష్టపర్చేందుకు కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యకర్తలకు ఎలవేళలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సమావేశంలో కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖ ముఖ్య సలహాదారు, పరకాల నియోజకవర్గ పాలక్ వెదిరె శ్రీరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కాచం గురుప్రసాద్, గుజ్జ సత్య నారాయణ, పరకాల నియోజకవర్గ ఇన్‌చార్జి పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొండి జితేందర్‌రెడ్డి, ఆర్పీ.జయంత్‌లాల్, ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నియోజకవర్గ కోకన్వీనర్ మాదారపు రతన్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు జంగిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజ్‌కుమార్, గన్ను సతీష్, తదితరులు మాట్లాడారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు.

అనుదీప్ శర్మకు సువర్ణ కంకణ అవార్డు



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలోని శ్రీ రాజేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు తాటిపాముల అనుదీప్ శర్మ ఉగాది మహోత్సవ వేడుకల్లో సువర్ణ కంకణ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని హరిహర కళాభవనంలో సీవీ రామన్ అకాడమీ (సేవా సాంస్కృతిక సంస్థ), రుద్రాక్ష వైభవం అధ్యాత్మిక పీఠం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 27వ సంవత్సర ఉగాది మహోత్సవాల్లో అనుదీప్ శర్మ అవార్డు అందుకున్నారు. పెద్దకోడెపాక గ్రామంలో కాకతీయ కాలంలో నిర్మించిన శివాలయాన్ని అభివృద్ధి చేయడంలో, కాలసర్ప దోషాలు నివారించేలా పూజలు చేస్తూ భక్తులకు అందిస్తున్న సేవలను గుర్తించి ఆయన్ను అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ మహేంద్రవాడ వెంకటేశ్వరరావు, శ్రీకృష్ణ సేవా సంస్థ అధ్యక్షుడు, సాలగ్రామ తేజో విభూషణ్ బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీకృష్ణ చాముండేశ్వర మహర్షి చేతుల మీదుగా అనుదీప్ శర్మకు అవార్డును, ప్రశంసా పత్రాన్ని నిర్వాహకులు అందజేసి సువర్ణ కంకణాన్ని అలంకరించి అభినందించారు. ఈ సందర్భంగా అనుదీప్ శర్మను స్థానిక సర్పంచ్ అబ్బు ప్రకాశ్‌రెడ్డి, ఎంపీటీసీ వావిలాల వేణుగోపాల ప్రసాద్, మాచర్ల మంగమ్మ రవి, పురోహితులు పన్నాటి జలంధర్ తదితరులు అభినందించారు.

'బీజేపీకి గుణపాఠం తప్పదు'

ధర్మసాగర్ : రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి గుణపాఠం తప్పదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ మండల అధ్యక్షుడు బట్టు మల్లయ్య ఆధ్వర్యంలో మండలంలోని కరుణాపురంలోని జాతీయ రహదారిపై ఖాళీ సిలిండర్లతో ఆదివారం నిర్వహించిన ధర్నాలో ఎల్లేష్ మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్, పెట్రోల్, డీజిల్, ఇతర నిత్యావసర సరుకుల ధరలను ఇష్టారీతిన పెంచుతోందని విమర్శించారు. గ్యాస్ సిలిండర్ ధర పెంపు వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వెలిబుచ్చారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధర పెంచి పేదల నడ్డి విరస్తోందని మండిపడ్డారు. పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమవడమే కాకుండా భారాలు మోపుతుండడం దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా వంట గ్యాస్ సిలిండర్ ధర తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న ఎన్నికల్లో బీజేపీని ప్రజలు గద్దె దింపుతారని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతం చేసి సమరశీల పోరాటాలు నిర్మిస్తామని, పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పెద్దపెండ్యాల గ్రామ శాఖ కార్యదర్శి గోకల రాజయ్య, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మాలోత్ శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునిగాల భిక్షపతి, రీల్ పూర్ణచందర్, స్వరూప లావణ్య, రాజారపు రత్నం, దేవయ్య, ఎనగందుల రాజు, రాజారపు రాజు, అంబాల గట్టయ్య, మునిగాల స్వామి, మంద సుమన్, హరీష్, మంద ప్రసాద్, పొన్నాల ఆరోగ్యం, పులిపాక సృజన తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూల్‌ను మరో చోటికి తరలించండి



మాట్లాడుతున్న బొక్కల నారాయణ

ఐనవోలు : మండలంలోని కొండపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు సమీపంలో ఏర్పాటైన ప్రైవేటు స్కూల్‌ను మరో చోటికి తరలించాలని విద్యాభివృద్ధి కమిటీ చైర్మన్ బొక్కల నారాయణ ప్రభుత్వాన్ని, విద్యా శాఖ ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. ఆ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గ్రామ విద్యా కమిటీ సమావేశానికి నారాయణ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల సమీపంలో ప్రైవేటు స్కూల్ ఏర్పాటు చేసేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం విద్యా చట్టాలను తుంగలో తొక్కడమేనని విమర్శించారు. పాఠశాల సమీపంలోని ప్రైవేట్ స్కూల్ ఉండడం వల్ల ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద విద్యార్థులు ప్రైవేట్ స్కూల్ విద్యార్థులతో పోల్చుకుని మానసిక వేదనకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో శంకర్, నాగరాజు, ఎలేందర్, జయశీల, కొమురమ్మ, కవిత, యాక్సిబా, సుమలత, కోమల, సుహాసిని పాల్గొన్నారు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు ఘనసన్మానం



మల్లారెడ్డిని సన్మానిస్తున్న రెడ్డి సంఘం ప్రతినిధులు

ఆత్మకూరు : మండల కేంద్రానికి చెందిన బొల్లెడ్ల మల్లారెడ్డి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సందర్భంగా మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ రేవూరి సుధాకర్‌రెడ్డి మాట్లాడారు. మల్లారెడ్డి పేదలకు, కష్టాల్లో ఉన్న వారికి న్యాయసేవలు అందిస్తూ అండగా నిలుస్తున్నారని కొనియాడారు. మల్లారెడ్డి పీపీగా నియామకం కావడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు రేవూరి ప్రభాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జిన్నా రామకృష్ణారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రేవూరి జయపాల్‌రెడ్డి, వంగాల భగవాన్ రెడ్డి, చీఫ్ అడ్వయిజర్ కరివేద మహేందర్‌రెడ్డి, రమణ, ఎంపీటీసీ బీరం రజనీకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో భారీ ర్యాలీ

మడికొండ: ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రం ఆధ్వర్యంలో మడికొండలోని మహిళా ప్రాంగణం నుంచి మడికొండ సెంటర్ వరకు ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రం జిల్లా అధికారి జయశ్రీ మాట్లాడారు. మహిళా దినోత్సవాన్ని డాక్టర్ ప్రీతికి అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో హేమారాణి, మంజుల, ప్రత్యూష, కస్తూరి, హఫీస్, కళ్యాణ్ పాల్గొన్నారు.

'కన్నారం వేలేరు మండలంలోనే ఉండాలి'



మాట్లాడుతున్న కన్నారం గ్రామస్తులు

ధర్మసాగర్ (వేలేరు) : నూతన మండలాల ఏర్పాటులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి ధర్మసాగర్ మండలంలోని కొన్ని గ్రామాలను, భీమదేవరపల్లిలోని కన్నారం, ఎర్రబెల్లి గ్రామాలను కలిపి వేలేరు మండలంగా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కన్నారం గ్రామం సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో కలుస్తోందనే ప్రచారం జోరందుకుంది. ఈ క్రమంలో గ్రామస్తులు ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. కన్నారం గ్రామాన్ని తమ మండలంలోనే ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రత్యేక చొరవతో వేలేరు మండలంలో ఫిబ్రవరి 27న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రూ.150 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారని తెలిపారు. ఈ క్రమంలో కన్నారం నుంచి వేలేరు మండల కేంద్రానికి రూ.4.27 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి స్పష్టమైన హామీ ఇచ్చారని చెప్పారు. కన్నారం గ్రామ అభివృద్ధికి అవకాశం ఉండడంతో మెజార్టీ ప్రజలు వేలేరు మండలంలోనే కన్నారం ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కేటీఆర్ పర్యటనకు ముందు కన్నారం గ్రామం అక్కన్నపేట మండలంలో కలపాలని కోరుకున్న ప్రజలు కూడా చాలా మంది ఇప్పుడు వేలేరు మండలంలోనే ఉండాలని కాంక్షిస్తున్నట్లు చెప్పారు. తద్వారా సాగునీటి, రవాణా మార్గం మెరుగుపడి గ్రామం అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నట్లు తెలిపారు. గతంలో కన్నారం గ్రామాన్ని గ్రామ పంచాయతీ తీర్మాణంతో వేలేరు మండలంలో కలిపినా ఎలాంటి తీర్మాణం లేకుండానే కన్నారం గ్రామాన్ని అక్కన్నపేట మండలంలో ఎలా కలుపుతారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వేలేరు మండలంలో కన్నారం గ్రామం ఉంటే సాగు, తాగునీటి, విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కన్నారం వేలేరు మండలంలో ఉండడం వల్ల మండల కేంద్రం 10 కిలోమీటర్లు, జిల్లా కేంద్రం 40 కిలోమీటర్లు దగ్గరగా ఉన్నాయని తెలిపారు. వేలేరు మండలంలో ప్రజలకు పనులు, విద్యార్థులకు సర్టిఫికెట్ల నిమిత్తం పనులు తొందరగా అవుతున్నాయని చెప్పారు. గ్రామంలో అధికారుల పర్యవేక్షణకు సౌకర్యంగా ఉందన్నారు. కన్నారం అక్కన్నపేట మండలంలో కలిస్తే మండల, జిల్లా కేంద్రం 70 కిలోమీటర్లకు పైగా దూరం అవుతుందని తెలిపారు. ఈ క్రమంలోనే తాము కన్నారం గ్రామం వేలేరు మండలంలోనే ఉండాలని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని కన్నారం గ్రామాన్ని వేలేరు మండలంలోనే ఉంచాలని కోరారు. సమావేశంలో ఎంపీటీసీ చెప్యాల బుచ్చమ్మ, ఎలబోయిన కొమురయ్య, సందెబోయిన సంపత్, అజీమియా, ఇరుగు శ్రీనివాస్, కాసబోని రాజేందర్, జక్కుల రాజయ్య, ముత్యాల సదానందం, జక్కుల గట్టయ్య, గొడుగు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.